



అనంతపురంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు



నల్లమాడలో వినాయకుడి ఊరేగింపులో భక్తుల కోలాహలం



ధర్మవరంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం

జై... జై... గణేశా..

ఉల్లాసంగా వినాయక నిమజ్జనం

కేరింతలు, ఈలలు, డ్యాన్సులు, డీజే మధ్య గణనాథుడి నిమజ్జనం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉల్లాసంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు స్వామికి పూజలు చేశారు. ఆదివారు తుదిపూజ చేసి, నిమజ్జనానికి బయల్దేరారు. వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో కొలువు దీర్చి ఊరేగింపుగా తరలించారు. అన్ని వయసుల వారు డ్రమ్స్ వాయిస్తూ, డ్యాన్సులు వేస్తూ.. రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. సమీపంలోని చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. 'గణపతి బప్పా.. మోరియా' అంటూ కేకలు వేశారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతపురంలో నిమజ్జనోత్సవం వైభవంగా సాగింది.

-ధర్మవరం(ఆంధ్రజ్యోతి)



ధర్మవరం చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న బీజేపీ నాయకులు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నిగ్గు తేల్చినా చర్యలేవీ..?

వైసీపీ హయాంలో యథేచ్ఛగా భూదందా

ఫ్రీహోల్డ్ అక్రమార్కులపై ఉదాసీనత

పట్టించుకోని యంత్రాంగం

పుట్టపర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అధికారం చేతిలో ఉంది కదా అని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలకు రెవెన్యూ యంత్రాంగం అసైన్డ్ భూములను అడ్డగోలుగా అప్పగించింది. పేదల నుంచి కాజేసిన కోట్ల విలువైన భూములు నేటికి భూ అక్రమార్కుల ఆధీనంలోనే ఉన్నాయి. ఫ్రీహోల్డ్ పేరుతో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూఅక్రమాలపై ఏడాది కిందట కూటమి సర్కారు క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించింది. ఫ్రీహోల్డ్, నిషేధిత భూములను వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చడంలో రాష్ట్రంలోనే జిల్లా మూడో స్థానంలో నిలిచింది. అక్రమ రిజిస్ట్రేషన్లలోనూ పది మండలాల్లో భారీగా వెలుగుచూశాయి. ఫ్రీహోల్డ్ అక్రమాల్లో ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు లెక్క తేల్చారు. అప్పట్లో వైసీపీ నేతలతో అంటకాగిన రెవెన్యూ అధికారులు పేదల భూములను ఆయాచితంగా రియల్ వ్యాపారులకు కట్టబెట్టారు. రెవెన్యూ అధికారుల అక్రమాలు నిర్ధారణ చేసి ఏడాది కావస్తున్నా ఇంత వరకు ఎలాంటి చర్యలు లేవు.

లక్ష ఎకరాలకు పైగా కట్టబెట్టేశారు..

జగన్ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూముల (యాజమాన్య హక్కుల కల్పన) ముసుగులో నిషిద్ధ 22(ఏ) జాబితా నుంచి అక్రమంగా తప్పించారు. 22(ఏ) ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ జరిగిన అసైన్డ్ భూములపై గత ఏడాది కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలు నిగ్గు తేల్చింది. నాటి ఉత్తర్వుల ప్రకారం 2003కు ముందు అసైన్‌మెంట్ భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉన్నా తర్వాత ఇచ్చిన వాటికి కూడా చోటు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 32 మండలాల్లో 2,57,042.47 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములను పరిశీలించగా.. ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు లెక్కతేల్చారు. ఇందులో రిజిస్ట్రేషన్లు జరిగనవి 5,242.08 ఎకరాలు, ఉత్తర్వుల మేరకు చేసినవి 3,101.07 ఎకరాలు కాగా నిబంధనలు అతిక్రమించి చేసినవి 2,141.01 ఎకరాలుగా లెక్క తేల్చారు. ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ జరిగిన భూముల్లో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు వారి అనుకూల రియల్ వ్యాపారులు ఉన్నట్లు విచారణలో తేలింది.



ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

కానరాని చర్యలు

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ చేసిన భూములతోపాటు రిజిస్ట్రేషన్లలో భారీ ఎత్తున అక్రమాలు జరిగిన మండలాల జాబితాలో మొదటి స్థానంలో ముదిగుబ్బ, రెండో స్థానంలో అమరాపురం, మూడో స్థానంలో రామగిరి నిలవగా.. 6,7,9 స్థానాల్లో కనగానిపల్లి, సోమందేపల్లి, పెనుకొండ నిలిచాయి. ముదిగుబ్బలో 14,509.88 ఎకరాల్లో ఫ్రీహోల్డ్‌గా (మిగతా 5వ పేజీలో..)

హృదయేశ్వరా.. సాయీశ్వరా..



వీణ, తబలా వాయిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సత్యసాయి నేషనల్ కౌన్సిల్ స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో మైమరింపజేశారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్‌లో చెన్నై విద్యార్థులు రెండోరోజు ఆదివారం 'హృదయేశ్వరా.. సాయిశ్వరా..' పేరిట కచేరి నిర్వహించారు. గానంతో కట్టి పడేశారు. ఢిల్లీ పాఠశాల విద్యార్థులు శ్రీసత్యసాయి కథ పేరిట సత్యసాయి జీవిత చరిత్రలోని ఘట్టాలను నృత్యం ద్వారా ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు వీణ, తబలా, హార్మోనియం వాయించారు. రామాయణంలోని ఘట్టాలను ప్రదర్శించారు. దాదాపు 15 రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆఖరి రోజు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అద్భుతం అనిపించాయి. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అవినీతి డంపింగ్..!

- పనులు చేయకనే రూ.13 కోట్లు స్వాహా
- వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల కుమ్మక్కు
- కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ అభిమాన అధికారులదే హవా
- ఎంపీ, ఎమ్మెల్యే లేఖలతో విజిలెన్స్ విచారణ



డంపింగ్ యార్డు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో చేసిన అక్రమాల్లో ఇదొక పెద్ద కుంభకోణం. వైసీపీ ప్రజాప్రతినిధులు, అప్పటి నగరపాలక సంస్థ అధికారులు కుమ్మక్కై డంపింగ్ యార్డులో బయోమైనింగ్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. డంపింగ్ యార్డులో కొండ కరగలేదు కానీ, నిధులు మాత్రం మింగేశారు. 2023లో డంపింగ్ యార్డులో బయోమైనింగ్ కోసం అప్పటి వైసీపీ ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.26 కోట్లకు టెండర్లు పిలిచింది. పనులు సగం పూర్తి చేశామంటూ 2024లో వివిధ దశల్లో రూ.13కోట్ల వరకు బిల్లులు చేసుకుని వైసీపీ ప్రజాప్రతినిధులు, ఏఎంసీ అధికారులు స్వాహా చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బిల్లులు చేయాల్సిన అప్పటి ఎగ్జామినర్లు (ఆడిటర్లు) కళ్లు మూసుకుని ఆమోదం తెలిపారు. డంపింగ్‌యార్డులో జరిగిన అక్రమాలపై అప్పటి సీడీఎంఏ క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు జరగకనే కోట్లాది రూపాయల బిల్లులను ఎలా మంజూరు చేశారని నిలదీశారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు డంపింగ్‌యార్డులో జరిగిన అక్రమాలపై నిలదీసినా జవాబిచ్చేనాథుడే కరువయ్యారు. ఇందులో అప్పటి ఓ ఇంజనీరు కీలకంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఇంజనీరును సాగనంపగా... కడప జిల్లా నుంచి ఆ స్థానానికి వచ్చిన ఇంజనీరు అప్పట్లో ఏమీ జరగలేదని...అంతా సక్రమంగా జరిగిందని వత్తాసు పలికి వైసీపీ భక్తి చాటుకున్నారు. జూనియర్ అయిన ఆ ఇంజనీరుకు కీలక బాధ్యతలు అప్పజెప్పడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే లేఖలతో డంపింగ్‌యార్డు బయోమైనింగ్‌లో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టారు. డంపింగ్‌యార్డులో అక్రమాలపై కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు నిలదీసినా అప్పటి ఎమ్మెల్యే, మేయర్, అధికారులు నోరు మెదపలేదకపోవడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. అప్పటి ఎంపీ రంగయ్య హాజరైన కౌన్సిల్‌కు వైసీపీ కార్పొరేటర్లు లేవనెత్తిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే గైర్హాజరుకావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంపీ, ఎమ్మెల్యే మొదటి కౌన్సిల్ సమావేశంలోనే డంపింగ్‌యార్డులో బయోమైనింగ్‌పై ఖర్చు చేసిన సొమ్ముపై విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖరాయడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ

(మిగతా 5వ పేజీలో..)

తాడిపత్రిలో రాళ్ల యుద్ధం

వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్తత

జేసీ వర్సెస్ కాకర్ల

లారీ, డీజే వాహనాల ధ్వంసం

టెకీ హత్య

ఘర్షణలో కత్తి పోటు

ఆస్పత్రికి తరలించేలోగా మృతి..

5

రైళ్లలో సీసీ కెమెరాలు..!



ఏర్పాటుకు సన్నాహాలు

చోరీలకు చెక్ పెట్టే దిశగా చర్యలు

హిందూపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణమంటే ఇటీవలిగా ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. దుండగులు రైలులో ప్రయాణిస్తూ ఏదో ఒక సిగ్నల్ వద్ద ఆపిన వెంటనే చోరీచేసి ఉడాయిస్తున్నారు. కిటికీల పక్కన ఉంటే ప్రయాణికుల మెడలోని బంగారు ఆభరణాలు లాగేస్తున్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు గస్తీ తిరుగుతున్నా.. చోరీలకు అడ్డుకట్ట పడట్లేదు. వీటిని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు సన్నద్ధమవుతోంది రైల్వే శాఖ. ప్రతి బోగీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు.

వరుస చోరీలతో ఆందోళన



దొంగలు రైలులో ప్రయాణిస్తుంటారు. ప్రయాణికులు ఏమరపాటుగా ఉంటే వారివద్ద ఉన్న బంగారు, నగదు ఎత్తుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలిగా రైలులో ప్రయాణించే మహిళలు బంగారు ఆభరణాలు పెట్టుకునేందుకు జంకుతున్నారు. రైలులో ప్రయాణికులు, బోగీలకు తగ్గట్టు పోలీసు సిబ్బంది లేకపోవడంతో దొంగల పని సులభం అవుతోంది. ఏదో ఒక స్టేషన్‌లో రైలెక్కి వారి పని కానిచ్చేసి దిగిపోతున్నారు. దీంతో దొంగలు ఎక్కడ ఎక్కారు, ఎక్కడ దిగారన్నది తెలుసుకునేందుకు కుస్తీ పడాల్సివస్తోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రైలులో ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగా కొంతమంది బస్సులను ఆశ్రయిస్తున్నారు.



హిందూపురం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రైలు

సన్నాహాలు

రైళ్లలో చోరీలకు చెక్ పెట్టే దిశగా రైల్వేశాఖ బోగిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. వాటిని పర్యవేక్షించేందుకు రైలులోనే ఒక బోగీలో సాంకేతిక నిపుణులు ఉంటారు. అనుమానం వచ్చినపుడు తనిఖీలు చేస్తుంటారు. బోగిల్లో ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసు సిబ్బందికి సమాచారం చేరవేస్తారు. వారు ఆ బోగీలోకి వెళ్లి అనుమానితులను విచారించే అవకాశం ఉంటుంది. మరికొంతమంది గంజాయి, ఇతర ప్రమాదకర వస్తువులను బోగీలో ఉంచి మరో బోగీలో ప్రయాణిస్తుంటారు. గంజాయిని పోలీసులు పట్టుకున్నా.. అసలైన దుండగులు తప్పించుకుంటున్నారు. ఇలాంటి వాటికి కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తే చెక్ పడనుంది.

చోరీలు తగ్గుతాయి

రైలు బోగిల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి బోగీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగలను పట్టుకునే వీలుంటుంది. చోరీలు కూడా తగ్గుముఖం పడతాయి. రైలులో బీట్‌లు పెంచాం. పాత నేరస్తులపై నిఘా వేస్తున్నాం. కొంతమందిని బైండోవర్ చేస్తున్నాం.

-అశోక్‌కుమార్, రైల్వే సీఐ

మార్గదర్శకులుగా నిలవండి

డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మంత్రి సూచన

ధర్మవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో విజయం సాధించిన ఉపాధ్యాయులు.. భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మంత్రి నడుపుతున్న సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో కడప జిల్లా ప్రొద్దుటూరులో డీఎస్సీ శిక్షణా శిబిరం నిర్వహించారు. అందులో శిక్షణ పొందిన 400 మందిలో 207 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. 20 మంది అభ్యర్థులు 80మార్కులకు పైగా సాధించారన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదన్నారు. భవిష్యత్‌తరాలను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.

అందరికీ భరోసా

నేడు పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి టౌన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు గతనెల మాదిరిగానే సోమవారం పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,64,384 మంది లబ్ధిదారులకుగాను రూ.115.68కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తామన్నారు. రివెరిఫికేషన్‌లో జిల్లాలో 7,163 మంది అనర్హులని తేల్చారనీ, వారికి కూడా పింఛన్ సొమ్ము అందజేస్తామన్నారు. ఉదయం 6.30 నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు. జిల్లాలోని 544 సచివాలయాల పరిధిలో 4,428 మంది సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని పీడీ వివరించారు.

బకాయిలు చెల్లించాలి: యూటీఎఫ్



అభివాదం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

పరిగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని సేవా మందిరంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కమిటీ మధ్యంతర సమావేశం నిర్వహించారు. శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాగానే ఆర్థిక బకాయిలు చెల్లిస్తామనీ, పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. 14 నెలలు గడిచినా అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే వర్తింపజేయాలని కోరారు. టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతామాలక్ష్మి, కోశాధికారి, శ్రీనివాసులు, కార్యదర్శులు తాహీర్‌వలి, శివశంకర్, నారాయణస్వామి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, కిష్టప్ప, లతాదేవి, రామకృష్ణనాయక్, నరసింహప్ప రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మారుతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిండుకున్న నిర్లక్ష్యం



పెద్దకోడిపల్లిలో ట్యాంకు చుట్టూ నిలిచిన నీరు

నీటి వృథా వద్దంటూ అధికారులు ఎన్నెన్నో నినాదాలు వినిపిస్తుంటారు. నీరు వృథా చేస్తే మిగిలేది కన్నీరేనంటూ గొప్పగొప్ప మాటలు చెబుతుంటారు. మరి ఇదేంటో వారే సెలవియ్యాలి. రొద్దం మండలం పెద్దకోడిపల్లిలో తాగునీటి ట్యాంకు నిండిపోయింది. ట్యాంకు చుట్టూ మోకాలిలోతు నీరు నిలబడింది. నీరు పట్టుకునే పరిస్థితి కూడా లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీరు వృథా అవుతూనే ఉంది. పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తోంది. ట్యాంకు చుట్టూ నీరు నిలబడటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న ఇళ్ల పునాదుల్లోకి నీరు ఇంకుతోంది. అయినా.. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వృథాగా వదిలేస్తూనే ఉన్నారు.

- రొద్దం(ఆంధ్రజ్యోతి)



క్రైం కార్నర్

టెకీ హత్య

● ఘర్షణలో కత్తి పోటు
● ఆస్పత్రికి తరలించేలోగా మృతి



టెకీ శ్రీకాంత్ (ఫైల్)

కదిరి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. వివాహమైంది.. కుమారుడు కూడా పుట్టాడు.. హాయిగా సాగిపోతున్న జీవితం.. మూడు నెలల బిడ్డకు నామకరణం చేద్దామని వచ్చాడు.. ఘర్షణలో ప్రాణాలు కోల్పోయాడు. తలుపులలోని బలిజపేట ప్రాంతానికి చెందిన టెకీ శ్రీకాంత్ (26). శనివారం అర్ధరాత్రి ఘర్షణలో ప్రాణాలు కోల్పోయాడు. తలుపుల ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజపేటకు చెందిన రాజారాం, అనిరుధ్ మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. యాప్‌లు, బ్యాంకుల్లో రాజారాం ద్వారా అనిరుధ్ రుణాలు ఇప్పించేవాడు. అందుకుగాను అనిరుధ్.. రాజారాంకు బాకీ పడ్డాడు. దీనికోసం శనివారం రాత్రి రాజారాం తన మనుషులతో అనిరుధ్ ఇంటికెళ్లాడు. ఆ సమయంలో అనిరుధ్, కుటుంబసభ్యులు ఇంట్లో లేరు. ఆగ్రహంతో ఉన్న రాజారాం ఇంటిముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసి, వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఇంటికొచ్చిన అనిరుధ్ కుటుంబ సభ్యులు తమ్ముడు లక్ష్మీకర్, తండ్రి శ్రీనివాసులు, బామ్మర్ది శ్రీకాంత్ మరికొంతమంది.. రాజారాం ఇంటి వద్దకెళ్లారు. రాజారాం, అతడి తండ్రి వెంకటరాయప్ప, తరుణ్.. ఘర్షణకు దిగారు. రాజారాం కత్తితో శ్రీకాంత్ తొడభాగంలో పొడిచాడు. అధిక రక్తస్రావం కావడంతో హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, చనిపోయినట్లు నిర్ధారించారు. ఇదే ఘటనలో శ్రీనివాసులు, లక్ష్మీకర్‌కు గాయాలయ్యాయి. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న గాయపడిన వారి నుంచి కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నాగేంద్ర వివరాలు సేకరించారు.

కుమారుడి నామకరణం వేళ..: ఘర్షణలో మరణించిన శ్రీకాంత్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండేవాడు. ఆయనకు భార్య పవిత్ర, మూడు నెలల కుమారుడు ఉన్నాడు. కుమారుడి నామకరణం సోమవారం గ్రామంలో నిర్వహించాల్సి ఉంది. ఈ శుభ కార్యం కోసం స్వగ్రామానికి వచ్చారు. ఇంతలోనే హత్యకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

జ్వరంతో యువకుడి మృతి

బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లికి చెందిన వరుణ్ (20) అనే యువకుడు ఆదివారం జర్వంతో మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వరణ్‌కు కొద్ది రోజులుగా జ్వరంతో రావడంతో స్థానికంగానే వైద్యం చేయించుకున్నాడు. దీనికి తోడు పచ్చ కామెర్లు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం వేకువజామున పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడే పడిపోయాడు. ఉదయం 10 గంటలైన ఇంటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు పొలంలోకి వెళ్లారు. అక్కడ పడిపోయి ఉన్న వరుణ్‌ను ఇంటికి తీసుకొచ్చి 108 వాహనంలో ఉరవకొండ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్వరంతో బాధపడుతున్న వరుణ్ ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హంద్రీనీవా కాలువలో వృద్ధురాలి మృతదేహం



సాలమ్మ మృతదేహం

కనగానపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హంద్రీనీవా కాలువలో ఆదివారం ఓ వృద్ధురాలి మృతదేహం కొట్టుకు వచ్చింది. తల్లిమడుగుల కాలువ వద్ద అటుగా వెళుతున్న స్థానికులు కాలువలో మహిళ తేలియాడుతుండటం గుర్తించారు. వెంటనే తాడు సహాయంతో వృద్ధురాలు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. వెం టనే పోలీసులు అక్కడికి వచ్చి విచారించగా మృతురాలు కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన చాకలి సాలమ్మగా(89)గా గుర్తించారు. ఈ ఘటనపై ఎస్ఐ మహ్మద్‌రిజ్వాన్‌ను వివరణ కోరగా.. శనివారం సాయంత్రం కరుట్లపల్లి సమీపంలో వృద్ధురాలు కాలువలో కాలుజారి పడ్డట్టు బాధితులు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు విచారణ చేస్తున్నామని తెలిపారు.

నిగ్గు తేల్చినా చర్యలేవీ..?

(3వ పేజీ తరువాయి)

మార్పుగా 13,538.48 ఎకరాలు అక్రమని తేలాయి. అమరాపురంలో 18,281.76గాను 10,781.27 ఎకరాలు, రామగిరిలో 19,877.20కిగాను 10,410.83, కనగానిపల్లిలో 14,039.83కి గాను 8300.08, సోమందేపల్లిలో 10,582.38కి గాను 7785.90, పెనుకొండలో 16,205.06కి గాను 7,501.68 ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. పెనుకొండలో నాగలూరు, ఎర్రమంచి, శెట్టిపల్లి, మునిమడుగు, ధర్మవరంలో కుణుతూరు, చిగిచెర్లలో భారీగా ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు జరిగినట్లు వెలుగుచూశాయి. ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లలోనూ రాష్ట్రంలో టాప్ 10లో పెనుకొండ మొదటి స్థానంలో నిలవగా మూడో స్థానంలో ధర్మవరం, 6,9 స్థానాల్లో సోమందేపల్లి, రొద్దం నిలిచాయి. జిల్లా వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ కల్పించిన భూముల్లో రిజిస్ట్రేషన్ల జరిగిన 5,242.08 ఎకరాల్లో నిబంధనలు అతిక్రమించి చేసినవి 2,141.01 ఎకరాలుగా నిగ్గుతేల్చారు. పెనుకొండ, ధర్మవరం, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, నీకేపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ అసైన్డ్ రిజిస్ట్రేషన్ జరిగాయి. పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనే సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ మండలాల్లో ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్లలో వ్యత్యాసాలతోపాటు అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. పెనుకొండలో 827.39 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయగా 326.10 ఎకరాలు, ధర్మవరంలో 372.11ఎకరాల్లో 264.49 ఎకరాలు, సోమందేపల్లిలో 458.98 ఎకరాల్లో 207.56 ఎకరాలు, రొద్దంలో 442.04 ఎకరాల్లో 194.15 ఎకరాలు అక్రమంగా చేసినట్లు గుర్తించారు. ఫ్రీహోల్డ్ అక్రమాలపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభించి ఈ ఏడాది మార్చి నెలలోనే నిగ్గు తేలినా చర్యలపై అధికార యంత్రాంగం తాత్సారం చేస్తోందని విమర్శలు నెలకొన్నాయి. కొంత మంది రెవెన్యూ అధికారులకు మాత్రం నోటీసులు ఇచ్చి వదిలేశారు.

ప్రయోగాత్మకంగా టీటీఈలకు బయోమెట్రిక్



బయోమెట్రిక్ హాజరు వేస్తున్న టీటీఈ

గుంతకల్లు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో పైలెట్ ప్రోగ్రామ్‌గా చేపట్టిన టికెట్ చెకింగ్ ఎగ్జామినర్ల (టీటీఈ) బయోమెట్రిక్ సైనిన్, సైనాఫ్ సిస్టంను గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో ప్రారంభించారు. గతంలో టీటీఈల హాజరు, విధుల నుంచి వైదొలగే కార్యక్రమం మాన్యువల్ ప్రక్రియగా ఉండేది. టికెట్ చెకింగ్ విధానంలో ఖచ్చితత్వం కోసం రైల్వే బోర్డు ద.మ. రైల్వే జోన్‌లో ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ సైన్ ఇన్, సైనాఫ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఆదివారం టీటీఈలు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర, ఫేస్ ఐడెంటిటీ, ఐరిస్, వాయిస్ గుర్తింపుతో హాజరు నమోదు, విధుల నుంచి వైదొలగే ప్రక్రియకు నాంది పలికారు.

ఒంటరి ప్రయాణికురాలి భద్రతపై దృష్టి

రైళ్లల్లో ఒంటరిగా వెళ్లే ప్రయాణికురాళ్లపై టీటీఈల ద్వారా ప్రత్యేక దృష్టిని నిలిపి వారికి భద్రత కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. గుంతకల్లు మీదుగా వెళ్లిన కోయంబత్తూరు-ముంబై (నం. 11014) ఎక్స్‌ప్రెస్‌లో టీటీఈల ద్వారా ఒంటరి ప్రయాణికురాళ్లను పలకరించి, వారి వివరాలను నమోదుచేసి, వారు గమ్యం చేరేంత వరకూ అందుబాటులో ఉంటామంటూ భరోసా కల్పించే కార్యక్రమాన్ని ఆరంభించారు.

తాడిపత్రిలో రాళ్ల యుద్ధం

● వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్తత
● జేసీ వర్సెస్ కాకర్ల
● లారీ, డీజే వాహనాలు ధ్వంసం



వాగ్వాదం చేసుకుంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్

తాడిపత్రి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీకే చెందిన కాకర్ల రంగనాథ్ వర్గీయులు రాళ్ల దాడి చేసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రధాన అనుచరుల్లో కాకర్ల రంగనాథ్ ఒకరు. మనస్పర్థలతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. కాకర్ల, జేసీ వర్గీయులు ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనానికి ఊరేగింపుగా బయల్దేరారు. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద రంగనాథ్ వాహనాన్ని ఆపి, డ్యాన్సులు వేస్తున్నారు. వెనకే జేసీ ప్రభాకర్ రెడ్డి విగ్రహ వాహనం ఉంది. దీంతో ఆయన త్వరగా వెళ్లాలని రంగనాథ్ వాహనం వారికి సూచించారు. దీంతో వాగ్వాదం తలెత్తింది. అక్కడున్నవారు సర్దిచెప్పి పంపించారు. అనంతరం రామచంద్ర లాడ్జి సమీపంలోకి రాగానే కాకర్ల రంగనాథ్‌కు సంబంధించిన వినాయక విగ్రహం వద్ద డీజేలు పెట్టి, పాటలు పాడుతూ, డ్యాన్స్‌లు వేస్తున్నారు. ప్రభాకర్‌రెడ్డి తొందరగా వెళ్లాలంటూ మరోసారి రంగనాథ్‌తో వాగ్వాదానికి దిగారు. వారి వర్గీయులు వెనుకవైపు నుంచి కేకలు వేయడంతో ఘర్షణ మొదలైంది. పరస్పరం రాళ్ల రువ్వుకున్నారు. కట్టెలు తీసుకుని, రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. కాకర్ల రంగనాథ్‌కు సంబంధించి వినాయకుడి విగ్రహాన్ని తరలించే లారీ, డీజే బాక్సుల వాహన అద్దాలు పగులగొట్టారు. పోలీసులు వెంటనే వాహనాలను పక్కకు పెట్టించారు. ఇరువర్గాలకు సర్ది చెప్పి ఇళ్లకు పంపించారు. అంతటితో సద్దుమణిగింది. ఆ తరువాత వినాయకుడి విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ నిమజ్జనానికి తరలించారు.



ధ్వంసమైన డీజే వాహన అద్దాలు



రాళ్లు రువ్వుకున్న దృశ్యం

ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నాం

● చూడలేని స్థితిలో వైసీపీ నాయకులు
● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
● పాపంపేటలో 'స్త్రీ శక్తి' విజయోత్సవ సభ



మహిళలకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాపంపేటలో స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ నిర్వహించారు. ముందుగా పాపంపేట సర్కిల్ నుంచి జొన్నా ఐరన్ మార్టు వెనుక భాగంలో నిర్వహించిన సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలు సూపర్ సిక్స్-సూపర్ హిట్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ మహిళను కదిలించినా సంతోషం కనిపిస్తోందని అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి 2004లోనే సైకిళ్లను పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి, సూపర్ హిట్ చేసి చూపించామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.4వేలు పింఛన్ ఇస్తున్నామని అన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం ఇచ్చామన్నారు. అన్నదాత సుఖీభవ మొదటి విడతగా రూ.7వేలు, దీపం పథకం కింద ఉచితంగా మూడు సిలిండర్లు, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు తమ ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. మహిళలకు విరివిగా రుణాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇన్ని మంచి పనులు చేస్తుంటే సైకో జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు ఇష్టమొచ్చినట్టు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నిత్యం ప్రభుత్వంపై విషప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. అనంతరం మండలంలోని డ్వాక్రా మహిళలకు రుణాలకు సంబంధించి రూ.23 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలతో కలిసి ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మార్గంలోని కురుగుంట వరకు మహిళలతో మాట్లాడుతూ జీరో ఫేర్ టికెట్ తీసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అంతర్ జిల్లా బదిలీలపై కసరత్తు

● జిల్లా నుంచి 53 మంది టీచర్ల దరఖాస్తు
● ఇతర జిల్లాల నుంచి వచ్చేందుకు 52 మంది..



దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి

అనంతపురం విద్య, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంతర్ జిల్లా టీచర్ల బదిలీలకు ఉత్తర్వులు ఇచ్చింది, దీంతో ఇతర జిల్లాలకు వెళ్లే టీచర్లు స్పౌజ్, మ్యూచువల్‌పై బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అనంత ఉమ్మడి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లేందుకు 53 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గ్రేడ్-2 హెచ్ఎంలు నలుగురు, పీఎస్ హెచ్ఎం ఒకరు ఉండగా.. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 19 మంది, ఎస్జీటీ కేడర్‌లో 29 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో జడ్పీ యాజమాన్యం పరిధిలో 45 మంది, మున్సిపల్ పరిధిలో ఐదుగురు, గవర్నమెంట్ పరిధిలో ముగ్గురు టీచర్లు ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు రావడానికి 52 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గ్రేడ్-2 హెచ్ఎంలు నలుగురు, పీఎస్ హెచ్ఎం ఒకరు ఉండగా.. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 17 మంది, ఎస్జీటీ కేడర్‌లో 30 మంది ఇతర జిల్లాల నుంచి అనంత జిల్లాకు రావడానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో స్పౌజ్ కేటగిరి కింద 37 మంది, మ్యూచువల్ కింద 15 మంది ఉన్నారు.

● **డీఎస్సీ నియామకాలలోపే..**

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. అంతర్ జిల్లా టీచర్ల బదిలీలు ఈ డీఎస్సీ నియామకాలలోపే చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో జిల్లాకు వచ్చిన అంతర్ జిల్లా బదిలీ టీచర్ల దరఖాస్తులను వెంటనే రాష్ట్రశాఖకు పంపాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం దరఖాస్తులను అనంత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించింది. జిల్లా నుంచి ఏప సబ్జెక్టు టీచర్లు ఎంతమంది ఇతర జిల్లాలకు వెళుతున్నారు.. ఇతర జిల్లాలకు చెందిన ఏప సబ్జెక్టు టీచర్లు రావడానికి ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో లెక్కతేల్చారు. వాటి ఆధారంగా జిల్లాలో ఆయా టీచర్లకు ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయా.. లేదా అని కూడా నివేదికలు రూపొందించి ఆదివారం రాత్రి రాష్ట్ర శాఖకు పంపించారు. వీటిని రాష్ట్ర శాఖ పరిశీలించి నిబంధనల మేరకు ఉన్నవారికి ఈ వారంలోపే అంతరజిల్లా బదిలీల ఆర్డర్లు విడుదలచేసే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

అవినీతి డంపింగ్..!

(3వ పేజీ తరువాయి)

ప్రారంభం కావడంతో కుంభకోణంలో భాగస్వాములైన ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు ఆందోళనలో పడ్డారు.

గతంలో పనిచేసిన ఆడిటర్లే కీలకం

డంపింగ్ యార్డులో బయోమైనింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వంలో బిల్లులను ఎగ్జామినర్లు (ఆడిటర్లు) కళ్లు మూసుకుని పాసు చేశారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఎగ్జామినర్లుగా పనిచేసిన ఇందిరారెడ్డి ప్రస్తుత స్టేట్ ఆడిట్‌లో జిల్లా అధికారిగా, వెంకటరమణ ప్రస్తుతం తిరుపతిలో ఆడిట్‌శాఖలో, గోవిందప్ప ప్రస్తుతం కర్నూలు ఆర్‌డీగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు ఎగ్జామినర్లే డంపింగ్ యార్డు బిల్లులు చేయడంలో కీలకంగా వ్యవహరించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే బిల్లులు మంజూరు చేశారని తెలుస్తోంది. మొదట రూ.1.8 కోట్లు, తరువాత రూ.6కోట్లు, ఆ తరువాత రూ.4కోట్లు బిల్లులు చేశారు. అదే క్రమంలో మరో రూ.2కోట్లు బిల్లులకు ప్రతిపాదనలు రాగా ఎగ్జామినర్లు మారడంతో తిరస్కరించారు.

డీఈని కాపాడడానికి పాట్లు

వైసీపీ ప్రభుత్వ హయాంలో డంపింగ్‌యార్డులో అక్రమాలకు కీలకంగా వ్యవహరించిన అప్పటి ఓ డీఈని కాపాడేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న డీఈ పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. 2019-24 మధ్య అక్రమాలకు పాల్పడిన డీఈపై కూటమి ప్రభుత్వం రావడంతో బదిలీ వేటు వేసింది. ఏఎంసీ నుంచి ఆ డీఈని గుత్తికి బదిలీ చేయగా...అక్కడ కమిషనర్ విధుల్లోకి చేర్చుకోలేదు. దీంతో అక్కడి నుంచి తిరిగి ధర్మవరానికి సాగనంపారు. ఆ ఇంజనీరును కాపాడేందుకు ఆయన స్థానంలో కడప జిల్లా నుంచి అప్పటి వైసీపీ నేతల సిఫారసులతో ఏఎంసీకి బదిలీపై వచ్చిన వైసీపీ అభిమానిగా ఉన్న ఇంజనీరు.. అప్పట్లో ఏమీ జరగలేదని...గతంలో పనిచేసిన ఇంజనీరుకు ఎలాంటి సంబంధం లేదంటూ నివేదిక ఇవ్వడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. డీఈ రాసిన నివేదికను ఎగ్జామినర్లు, కమిషనరు తిరస్కరించి ఘాటుగా హెచ్చరించినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చినా నగరపాలక సంస్థలో ఇప్పటికీ వైసీపీ అభిమానులే రాజ్యమేలుతున్నారనడానికి ఇదొక నిదర్శనంగా నిలుస్తోంది.

విజిలెన్స్ విచారణ జరుగుతోంది



డంపింగ్ యార్డులో బయోమైనింగ్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న మాట వాస్తవమే. అప్పట్లో ఎంత మేర పనిజరిగింది...ఎంత నిధులు ఖర్చు చేశారనే అంశాలన్నీ విజిలెన్స్ విచారణలో తేలుస్తారు. ఇందులో నిజానిజాలు తేలాక ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న విజిలెన్స్ విచారణకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాం. ఇంజనీర్ల వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు సంబంధించిన రికార్డులన్నీ ఇవ్వాలని సూచించాం. అంతర్గతంగా జరుగుతున్న విజిలెన్స్ విచారణకు సంబంధించిన వివరాలను రహస్యంగానే ఉంచాలి. విచారణ అనంతరం విజిలెన్స్ అధికారులే ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు.

-బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

కూలి బతుకుల్లో కన్నీళ్లు..

● కూలీల ఆటోను ఢీకొన్న వ్యాన్ ● ఇద్దరు మృతి
● డ్రైవర్ సహా 12 మందికి గాయాలు



మల్లెల లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ(ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పరాయి ఊరికి పని కోసం బయల్దేరిన కూలీల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం కన్నీళ్లు నింపింది. మలుపులో మృత్యువు వ్యాన్ రూపంలో దూసుకొచ్చింది. ప్రాణాలు తీసి, కుటుంబాల్లో చీకట్లు నింపింది. మండలంలోని మైలసముద్రం గ్రామ సమీపాన ఆదివారం ఉదయం కూలీల ఆటోను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. 12 మంది గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన 13 మంది మహిళా కూలీలు అదే ఊరికి చెందిన గోపాల్ ఆటోలో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లికి కూలి పనుల కోసం బయలుదేరారు. మైలసముద్రం గ్రామ సమీపంలోని మలుపు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఒలిపి లక్ష్మీనరసమ్మ(70) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన రాజేశ్వరి, లక్ష్మమ్మ, మల్లెల లక్ష్మీదేవి, చిన్నాగమ్మ, వెంకటనారాయణమ్మను 108 వాహనంలో కొత్తచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ముగ్గురు గంగమ్మ, రమాదేవి, ఆటో డ్రైవర్ గోపాల్‌ను పుట్టపర్తిలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. మల్లెల లక్ష్మీదేవి(50) కొత్తచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చిన్నాగమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మమ్మను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒలిపి లక్ష్మీనరసమ్మకు కుమారుడు ఓబిరెడ్డి ఆలియాస్ చంద్రాయుడు ఉన్నాడు. అతడు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మల్లెల లక్ష్మీదేవికి భర్త ఈశ్వరప్ప, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు, బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. ఒలిపి లక్ష్మీనరసమ్మ, మల్లెల లక్ష్మీదేవి మృతదేహాలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



దెబ్బతిన్న ఆటో

డాక్టర్లపై దాడికి యత్నం

మల్లెల లక్ష్మీదేవి కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు ఆమెను చూడటానికి పెద్దఎత్తున ఆస్పత్రికి వచ్చారు. దీంతో అక్కడున్న రోగులకు ఇబ్బంది కలుగుతుందని వైద్యులు, సిబ్బంది తెలిపారు. మృతిచెందితే చూడటానికి వస్తే.. ఆంక్షలు విధిస్తారా అంటూ డాక్టర్‌పై దాడికి యత్నించారు. పోలీసులు రంగప్రవేశం చేసి, వారిని అక్కడి నుంచి పంపించేశారు. బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

● డివైడర్‌ను ఢీకొన్న కారు ● వ్యక్తి దుర్మరణం



అంజినకుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలికొంది. రహదారి పక్కనే ఉన్న ఇనుప డివైడర్ ప్రమాదకరంగా మొన తేలి ఉన్నా.. పట్టించుకోలేదు. మరమ్మతులు చేయలేదు. ఆ డివైడర్‌ను కారు ఢీకొనడంతో అందులోకి చొచ్చుకొచ్చి వ్యక్తి దుర్మరణం చెందాడు. మండలంలోని గుట్టూరు గ్రామ సమీపాన 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం ఇనుప డివైడర్‌ను కారు ఢీకొని గొల్ల అంజినకుమార్ (34) అక్కడికక్కడే మృతిచెందారు. కియ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన గొల్ల అంజినకుమార్ కారులో పనినిమిత్తం బెంగళూరుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గుట్టూరు సమీపంలోకి రాగానే ఇనుప డివైడర్‌ను కారు ఢీకొంది. ఇనుప చువ్వ లోపలికి చొచ్చుకురావడంతో అద్దాలు పగిలి, ఆ ముక్కలు అంజినకుమార్ దేహంలోకి చొచ్చుకెళ్లాయి. దీంతో తీవ్ర రక్తస్రావమై, అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. అంజినకుమార్‌కు భార్య రాజేశ్వరి, కుమారుడు ఉన్నారు. అతడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ముందే హెచ్చరించిన ఆంధ్రజ్యోతి


కియ కార్ల కంపెనీ సమీపాన జాతీయరహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో పెనుకొండ నుంచి గుట్టూరు వరకు జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ఇనుప డివైడర్ రోడ్డుపైకి వచ్చింది. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడంలేదని ఈ ఏడాది జూన్ 14న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. హైవే అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివారం ప్రమాదంలో అంజినకుమార్ బలైపోయాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఇనుప డివైడర్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కారులోకి చొచ్చుకొచ్చిన ఇనుప డివైడర్

టమోటా కిలో రూ.25

అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ట ధర రూ.14, సరాసరి ధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647

AJA- Sathish

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్:9030661651.

AJA- 246586

CHANGE OF NAME

★ I Pujari Narayanaswamy (Old Name), S/O Pujari Chandra Narayana R/o Hno 1/60, Peravali, Anantapur, AP-515701,I Have changed my name As Pujari Narayana Swami (New Name), S/o Pujari Chandra Narayana For All Purposes AJH-003250

ADMISSIONS

American College of Paramedical courses Qualification: ఇంటర్ మీడియట్ రెండు సంవత్సరాలు పూర్తి అయిన వారికి మరియు open inter any group students(1). D.M.L.T (2).Anaesthesia (3).Cordiology (4). D.M.P.H.A. రెండు సంవత్సరాల కోర్సులకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. Cont:9989953273,7013370612.

AJA-7174

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు


అలంకరణలో పెద్దమ్మ దేవత

ముదిగుబ్బ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఊరిలో వెలసిన గ్రామదేవత పెద్ద మ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్ల వారుజామున అమ్మవారిని వివిధ రకల పుష్పాలు, వేప మండలతో అలంకరించి పూజలు చేసినట్లు పూజారులు పెద్దన్న, శివసాయి తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. మహిళలు అమ్మవారికి గాజులు, చీరలు, వడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వినాయక లడ్డూ వేలం



నంబులపూలకుంటలోని పీర్లచావిడి వద్ద కొలువుదీరిన వినాయకుడి లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించారు. గ్రామస్థుడు వినయ్‌కుమార్ రూ.84వేలకు దక్కించుకున్నాడు. - నంబులపూలకుంట

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సోమవారం నియోకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన వెలువడింది. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని అందులో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం స్త్రీశక్తిపథకంపై మహిళలతో కలసి తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా షాదీమహల్ చేరుకుని సమావేశంలో పాల్గొంటారు. అంతకు మునుపు ఉదయం 7.30 గంటలకు కొడపగానిపల్లి, 8 గంటలకు ఇండ్లవెంకటంపల్లి, 9కి తలమర్ల, 9.30కు బంగారు చెన్నేపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

కులం పేరుతో వేధిస్తున్నారు

● వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు


మాట్లాడుతున్న అనిత, నారాయణస్వామి

ధర్మవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తమను కులం పేరుతో దూషిస్తూ వేధింపులకు గురిచే స్తున్నారని పట్టణంలోని తొమ్మిదో వార్డు చిన్నూరుకు చెందిన అనిత విలేకరుల ఎదుట వాపోయింది. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.... తాను ఎస్సీ కులానికి చెందిన అమ్మాయిని అన్నారు. తాను, వడ్డెర కులానికి చెందిన నారాయణస్వామి 2019లో పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నామన్నారు. తమకు ముగ్గురు పిల్లలని, కాపురం సజావుగా సాగుతోందన్నారు. అయితే తన తోడి కోడలు అనిత, బావ శేషు తరచూ కులం పేరుతో దూషిస్తున్నారని, పలుమార్లు దాడులు చేశారని ఆరోపించారు. పలువురు గ్రామస్థులు కూడా కులం పేరుతో దూషిస్తున్నారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం చిన్నూరులో వినాయక మండ పానికి వెళితే కులం పేరుతో దూషిస్తూ దాడిచేశారని వాపోయింది. ఈ విషయంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తరువాత కూడా రాత్రి ఇంటివద్దకు వచ్చి మళ్లీ దాడి చేశారన్నారు. దీంతో తీవ్రమనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తన భర్త నారాయణస్వామి అడ్డుకుని ప్రాణాలు కాపాడారన్నారు. తన తోడికోడలు, బావల నుంచి ప్రాణహాని ఉందని, తనను కాపాడాలని ఆమె కన్నీటిపర్యంతమైంది.

వ్యక్తిపై దాడి... ఇద్దరిపై కేసు

ధర్మవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌కు చెందిన దుంగావత్ గోపీ నాయక్‌పై, అదే నగర్‌కు చెందిన సూర్యనారాయణనాయక్, నాగరాజునాయక్ దాడి చేసినట్లు కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. శారదానగర్‌కు చెందిన దుంగావత్ గోపీనాయక్ శనగవిత్తనాలు,పప్పులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు శనివారం శారదానగర్‌లో వినాయక నిమజ్జనానికి వీధిలో ఉన్న యువకులతో కలిసి బత్తలపల్లి మండలం సంఘమేశ్వర వంక వద్దకు వెళ్తున్నాడు. దారి మధ్యలో మల్లేనిపల్లి వద్ద గోపీ నాయక్‌కు రవినాయక్, సూర్యనారాయణనాయక్ గొడవజరిగింది. నిమజ్జనం తరువాత శనివారం రాత్రి గోపీనాయక్ ఇంటి వద్దకు సూర్యనారాయణ నాయక్, అతడి కుమారుడు నాగరాజు నాయక్ వెళ్లి గొడవపడ్డారు. అడ్డు వచ్చిన గోపీనాయక్ తల్లి సాలమ్మ, తమ్ముడు పవన్ నాయక్‌ను వారు పక్కకు నెట్టి గోపీనాయక్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా గాయపడిన సాలమ్మను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీంతోఆదివారం సూర్యనారాయణనాయక్, నాగరాజు నాయక్ తనపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారంటూ గోపీ నాయక్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తికి మాజీ మంత్రి పరామర్శ


గాయపడిన శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

నల్లమాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాసంవారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్సలు పొంది, ఇంటివద్ద విశ్రాంతి తీసుకుం టున్నారు. ఆయనను ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పరామర్శించారు. సంఘటనపై కుటుంబసభ్యులతో ఆరాతీశారు. అనంతరం మండలంలోని చంద్రాయునిపలిలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొరు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కొత్తచెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురానికి చెందిన భాస్కర్‌నాయుడు ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భాస్కర్‌నాయుడిని ఇటీవల కొత్త చెరువు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్ నమోదు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన అతడు తనను అనవసరంగా రౌడీషీటర్‌గా నమోదు చేశారని పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంట్లో మద్యంలోకి పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం అనంతపురానికి తరలించారు. అతడు ప్రస్తుతం టీడీపీలో కార్యకర్తగా ఉన్నాడు.


ధర్మవరంలో వినాయకుడి ఊరేగింపు


సంగమేశ్వర చెరువులో నిమజ్జనం చేస్తున్న యోగా అసోసియేషన్ సభ్యులు

జయము జయము గణేశా..!

ఘనంగా నిమజ్జనం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

గణేశ్ నిమజ్జనాన్ని ఐదో రోజు ఆదివారం పుట్టపర్తి, ధర్మవరంలో ఉల్లాసంగా నిర్వహించారు. పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ట్రాక్టర్లపై, ఆటోలపై ఉంచి నిమజ్జనానికి తీసుకెళ్లారు. ధర్మవరంలో డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప బందోబస్తు నిర్వహించారు. పట్టణ సమీపంలోని సంగమేశ్వర, మోటుమర్ల, గొల్లపల్లి, కుణుతూరు వంకల్లో నిమజ్జనం చేశారు. ధర్మవరంలోని పలు వార్డుల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పలు వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనం కోసం రెండు భారీ క్రేన్లను ఏర్పాటుచేసినట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. నిమజ్జనానికి అవసరమైన సహాయం అందించామన్నారు. అలాగే నల్లమాడ, నంబులపూల కుంట, తలుపుల మండలాల్లో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.


పుట్టపర్తిలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


తలుపులలో...

తహసీల్దార్ కార్యాలయంలో పలు స్థానాలు ఖాళీ

● ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం


ఖాళీగా ఉన్న ఆర్ఐ కుర్చీ

ధర్మవరం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో ఉన్న సిబ్బందిపై పని భారం పెరిగింది. దీంతో ప్రజలకు సేవలు అందించడంలో అలస్యమవు తోంది. అలాగే కార్యాలయంలో ఆర్ఐ పోస్టుతో పాటు సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు కార్యాలయ అధికారులు తెలుపుతున్నారు. ఈ కార్యాలయం పరిధిలో ధర్మవరం పట్టణంతో పాటు మండలంలోని 20 పంచాయతీలు ఉన్నాయి. పట్టణ, రూరల్ పరిధిలో సుమారు 1.70లక్షల జనాబా ఉంది. మండలవ్యాప్తంగా 32,070 రైతుల ఖాతాలు ఉన్నాయి. ఇంతపెద్ద మండలానికి గతంలో ఇద్దరు ఆర్ఐలు ఉండే వారు. ప్రస్తుతం ఒక్క ఆర్ఐ కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతే గాకుండా భూ సమస్యలు, విద్యార్థుల కుల ధ్రువీకరణ, ఇన్‌కం సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలకు సంబంధించి ఆర్ఐ రిపోర్టు ఖచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఆర్ఐ పోస్టు సంవత్సరం నుంచి ఖాళీగా ఉంది. గతంలో పనిచేస్తున్న ఆర్ఐ రమాదేవి అనంతపురం జిల్లాకు బదిలీకావడంతో అప్పటి నుంచి ఎవరినీ నియమించలేదని ఆ కార్యాలయంలోని అధికారులు తెలుపుతున్నారు. ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయా గ్రామాల వీఆర్ఓలపై పనిభారం పెరిగిందని, దీంతో సకాలంలో ప్రజలకు సేవలు అందడంలేదని పలువురు పేర్కొంటున్నారు. అదేవిధంగా సీనియర్ అసిస్టెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో భూ సమస్యలకు సంబంధించి కోర్టు పెండింగ్ కేసులన్నీ పేరుకుపోయినట్లు సమాచారం. ఇంతపెద్ద మండలానికి సీనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో పనులెలా సాగేదని పలువురు అంటున్నారు. ఉన్న సిబ్బంది ద్వారా పనులు చేయిస్తుండటంతో అలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోనే ధర్మవరం పట్టణం, రూరల్ పరిధికి ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండటంతో రైతులకు మెరుగైన సేవలు అందడంలేదన్న వాదన వినిపి స్తోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీచేసి ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దారే దిక్కు

ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నటరాజు రెండు నెలల క్రితం చిలమత్తూరు మండలానికి బదిలీ అయ్యారు. ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సురేష్ బాబుకు ఎఫ్ఏసీ కింద తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడం, అన్నింటిని తహసీల్దారే చూసు కోవడంతో పాటు ప్రొటోకాల్ ఉంది. పైగా కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సిబ్బంది లేకపోవడంతో పనిభారంతో ఆయన అల్లాడిపోతున్నట్లు సమాచారం.

జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం

కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటం వాస్తవమే. భూసమస్యలతో పాటు కోర్టు పెండింగ్ కేసులతో పనిభారం ఎక్కువగా ఉంది. ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌ల ఖాళీలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం.

- సురేష్‌బాబు, తహసీల్దార్, ధర్మవరం

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట ఏదీ..?

గాండ్లపెంట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో నిత్యం అక్రమంగా కలప రవాణా చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే దీనికి అడ్డుకట్ట ఏదీ అని ప్రశ్నిస్తు న్నారు. పలు గ్రామాల్లో కలప వ్యాపారులు నిత్యం పచ్చని చెట్లను నరుకుతూ, కలప రవాణా జోరుగా సాగిస్తున్నారు. స్థానిక కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో నిత్యం ట్రాక్టర్లు, మినీ ట్రక్కులలో కలప రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నట్లు తెలుపుతున్నారు. కలప రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు, మామూళ్లు తీసుకుని కలప వ్యాపారులకు సహకరిస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకపోయినా, రవాణా సాగిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. పచ్చనిచెట్లు ఇలా అంతరించిపోతే పర్యావరణం దెబ్బతినే ప్రమాదముందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కలప అక్రమ రవాణాపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.


గాండ్లపెంట మీదుగా వేప చెక్కలను రవాణా చేస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


క్రీడా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

బత్తలపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ఆదివారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ ఆధ్వర్యంలో చిల్డ్రన్ హోం విద్యార్థిని విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఖోఖో, స్కిప్పింగ్, రన్నింగ్, సైకలింగ్, ఫుట్‌బాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో 21మంది విద్యార్థులు, 22 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వార్డెన్‌లు పుష్పలత, యల్లప్ప, ఉపాధ్యాయులు సరోజ, గిరిరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నల్లమాడలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నల్లమాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 1994-95లో పది చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. అందరూ ఒక్క చోట చేరి గత స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఒకరినొకరు క్షేమసమాచారాలు తెలు సుకుని ఆనం దం వ్యక్తం చేశారు. అప్పటి ఉపాధ్యాయులైన వెంకటరమణప్ప, దేవరం, బాషా, సుబహాన్, రమాదేవి, వార్డెర్ రవిచంద్రరాజు, ప్రస్తుత ప్రధానోపా ధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తదితరులను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థి నల్ల శింగయ్య గారిపల్లికి చెందిన మాడిశెట్టి శ్రీనివాసులు పాఠశాల ఆవరణంలోని జువ్విచెట్టు చుట్టూ అరుగు నిర్మించేందుకు రూ.20వేలను ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. రెడ్డి, నారాయణస్వామి, అనిల్, మధు, అనిత, నాగజ్యోతి, నాగరత్న, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 14యేళ్ల కిందట చదువుకున్న మిత్రుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో 2010-11లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిశారు. అప్పటి జ్ఞాప కాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు కృష్ణానాయక్, ఉపాధ్యాయులు నాగరాజు, గౌస్‌ఖాన్, రిజ్వానులా ఖాన్, లక్ష్మీనారాయణ, రవిచంద్ర, రవీంద్ర, మధుబాబు, బాల నరసింహులు, ఉషారాణి, నీళ్ల ప్రసాద్‌ను దుశ్శాలావాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబాఫకృద్దీన్, అమర్‌నాథ్


ఓబుళదేవరచెరువులో...

వైభవంగా రాధాష్టమి


అలంకరణలో జగన్నాథుడు, సుభద్ర, బలరాముడు

ధర్మవరం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మం దిరంలో కొలువుదీరిన జగన్నాథుడు, సుభద్ర, బలరాముడి ప్రతిమలకు ముందుగా అభిషేకాలు చేశారు. అందంగా అలంకరించి, పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. ఇస్కాన్ భక్తుల తో పాటూ పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి: ఏపీటీఎఫ్


ఏపీటీఎఫ్ ధర్మవరం మండల కమిటీ సభ్యులు

ధర్మవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వెంటనే పీఆర్సీని కమిటీని నియమించి, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు బీకే ము త్యాలప్ప ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. స్థానిక ఎన్జీఓహోంలో ఆదివారం ఏపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు హాజరయ్యారు. ధర్మవరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి బలరాముడు, జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు బీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా బయన్న, అధ్యక్షుడిగా శివానంద, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనరసయ్య, భవాని, సంజీవప్ప, చంద్రశేఖర్, కవితను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శులుగా శ్రీరంగప్రసాద్, ఆదినారాయణ, స్వరూప, ఆదినారాయణ, పెద్ద ఓబుళేశు, జిల్లా కౌన్సిలర్లుగా నాగరాజు, తిప్పన్న, హేమంత్‌కుమార్, శంకర్‌నారాయణ, కళావతి, వాసుకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గురుమూర్తి, ఆడిట్ కమిటి సభ్యులుగా కుళ్లాయప్ప, వెంకటేశ్‌నాయక్‌ను ఎంపికచేశారు. నూతనంగా ఎంపిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. నూతన మూల్యాంకన విధానాన్ని రద్దుచేసి ఉపాధ్యాయులకు బోధన చేసే అవకాశాన్ని కల్పించాలని వారు కోరారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణనాయక్


రామకృష్ణనాయక్‌ను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన రామకృష్ణనాయక్‌ను ఎన్నుకున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పరిగి మండలం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రామకృష్ణనాయక్‌ను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. రామకృష్ణనాయక్ ఎంపిక పట్ల ధర్మవరం జోన్ నాయకులు లక్ష్మమ్మ, అమర్‌నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, సురేశ్, రమేశ్, హరికృష్ణ, సాయిగణేశ్, ఆంజనేయులు, రామాంజినేయులు, రాంప్రసాద్, కేజీనాగిరెడ్డి,ఆదిశేషయ్య, హరిశంకర్, మేరీ వరకుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి


నిఖ్యశ్రీతో అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన బాలిక నిఖ్యశ్రీ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 14 నుంచి 17వతేదీ వరకు జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు తరపున నిఖ్యశ్రీ పాల్గొని ప్రతిభ కనబరచిందన్నారు. ఆమె పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో సెప్టెంబరు 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే 75వ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడిఅనంతజిల్లా జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఆమెను ఆదివారం శెట్టిపి జయచంద్రారెడ్డితోపాటు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్‌లు అభినందించారు.

రోడ్డుపై మడుగు

● పంచాయతీ కార్యాలయం ఎదుటే నిలిచిన నీరు
● పట్టించుకోని అధికారులు


ఉప్పనేసినపల్లిలో ప్రధాన రోడ్డుపై నిలిచిన నీరు

ధర్మవరం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పనేసినపల్లిలో ప్రధాన రోడ్డుపై మురుగునీటితో పాటూ వర్షపునీరు నలిచి మడుగును తలపిస్తోంది. గ్రామ పంచా యతీ కార్యాలయం ఎదుటే ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో గ్రామస్థులతో పాలు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో దోమలతో అల్లాడిపోతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వారం రోజులుగా నీరు నిలిచి ఉన్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వర స్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్ స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

హిందూపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెం గళూరులో నిర్వహించిన 4వ సౌత్‌జోన్ ఇండియా కరాటే చాం పియన్‌షిప్‌లో విద్యార్థులు ప్రతిభచాటారు. ఆదివారం కోరమంగల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే కటా, స్పారింగ్ పోటీల్లో కిషోర్‌కుమార్ గోల్డ్, సిల్వర్‌మెడల్, శ్రీరామ్ సిల్వర్, గోల్డ్ మెడల్, ధనుష్‌కుమార్ బ్రాంజ్ మెడల్, జాన్‌విక్టర్ బ్రాంజ్ మెడళ్లు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మాస్టర్ ఫిరోజ్‌అహ్మద్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

భవాని రవికుమార్‌కు ఘన స్వాగతం



రవికుమార్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

గోరంట్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన భవానీ రవికుమార్‌కు పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో జనసేన నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. రవికుమార్ బెంగళూరు నుం చి అనంతపురం వస్తుండగా జనసేన మండల నాయకులు పా లసముద్రం కూడలిలో కలిసి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువ, పూలమాలతో సత్కరించారు. జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, వెంకటేష్, అబ్దుల్, అనిల్‌కుమార్, నరేష్, నగేష్, రాఘవేంద్ర, రమేష్, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

రొద్దం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డివారి మంజునాథ్‌ను టీడీపీ నాయకులు సన్మానించారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం పెనుకొండలో ఆయనకు శాలువకప్పి పూలహారాలతో సత్కరించారు. చిన్నవయసులోనే రాష్ట్రస్థాయి పోస్టుకు ఎంపిక కావడంపై కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. నగర కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, హరీష్, మాజీ సర్పంచ్ గోపాల్, బీజేపీ జిల్లా కార్యదర్శి నీరుగంటి వేణుగోపాల్, మండల తెలుగు యువత అధ్యక్షులు రుద్రప్రసాద్, బీజేపీ నాయకులు రాజా, నెట్టం రామాంజి, తిప్పేస్వామి, చాగలహనుమంతరాయుడు పాల్గొన్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిర టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి పగలు ఎండలు కాస్తున్నా సాయంత్రం అయ్యేసరికి చల్లబడి వర్షం కురుస్తుడడంతో వాతావరణం చల్లబడుతోంది. దీంతో రైతులు పెట్టిన పంటలు పచ్చదనం సంతరించుకున్నాయి. కొంత మంది రైతులు ఉలువలు, జొన్నల విత్తనాలను విత్తుతున్నారు.

గుడిబండ: మండలంలోని ఎస్.రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్ గుండ్లు, మేకలగట్ట, మందలపల్లి, కొంకల్లు తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతులు సాగుచేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

అమరాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మంచి లభించిందని రాజయోగిని పుష్పలత తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ బంధుత్వ దినోత్సవంలో భాగంగా రాజయోగిని దాదిప్రకాశ మణిజీ 18వ స్మారక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. శిబిరానికి 85మంది పాల్గొని రక్తదానం చేసినట్లు ఆమె తెలిపారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ బృందం, వైద్యుడు నిఖిల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

హిందూపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలంపల్లి క్రాస్‌వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మనోహర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పాలసముద్రం గ్రామానికి చెందిన నవీన్ హిందూపురం వైపు వస్తుండగా బాలంపల్లి క్రాస్‌వద్ద స్పీడ్‌బ్రేకర్ దాటే సమయంలో కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని 108వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

దర్గాను దర్శించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్

పెనుకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయరహదారిపక్కన వెలసిన బెహలూల్‌షాఖాద్రి దర్గాను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతి ఆదోని శెక్షావలి ఆమెకు ముస్లిం సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం స్వామి సమాధివద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



నింకంపల్లి రోడ్డులో గోమాత వద్ద నిలబడి ఉన్న వినాయకుడు



కాళికామాత చెంతన గణనాథుడు

పూజలందుకుంటున్న గణనాథులు

హిందూపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని హిందూపురంలో వీధివీధిన ఏర్పాటుచేసిన గణనాథులకు ఐదోరోజు ఆదివారం భక్తులు పూజలుచేసి దర్శించుకున్నారు. వివిధ రూపాల్లో ఉన్న గణనాథులను చూడటానికి భక్తులు క్యూకట్టారు.



హనుమంతుడితో వినాయకుడు



పార్వతీదేవి ఒడిలో విఘ్నేశ్వరుడు



ఏకలవ్య వినాయక సేవామండలి ఏర్పాటుచేసిన గణేశుడు

మహిళలను దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

రొద్దం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సానిపల్లి గ్రామానికి చెందిన ఈడిగ రామాంజినప్ప మహిళలను దుర్భాషలాడాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదని మహిళలు స్టేషన్ ముందు నిరసన తెలిపారు. ఆదివారం సానిపల్లి గ్రామానికి చెందిన బోయకులస్థులు మహిళలను దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేయలేదంటూ రోడ్డుపై బైఠాయించారు. రెండు రోజుల క్రితం సానిపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఈడిగ రామాంజినప్ప, బోయకులస్థుల మహిళలు వాగ్వాదం చేసుకున్నారు. ఈ విషయంపై మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఇరువర్గాలను పిలిపించి విచారించగా మాకు న్యాయం చేయలేదని మహిళలు నిరసనకు దిగారు. రామాంజినప్పను అరెస్ట్‌చేసేవరకు కదలమని భీష్మించారు. ఎస్‌ఐ నరేంద్ర టీడీపీ నాయకులు వెంకటేశ్‌కు సర్దిచెప్పి రామాంజినప్పపై కేసు నమోదుచేశామని, అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్నా చేస్తున్న వారికి సర్దిచెప్పి నిరసనను విరమింపజేశారు.



పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించిన సానిపల్లి మహిళలు

సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం

● మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

గోరంట్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమాజంలో తల్లిదండ్రుల తరువాత గురువులది ప్రత్యేక స్థానమని మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లి ఉన్నతపాఠశాలలో ఆదివారం జరిగిన పదవీ విరమణ కార్యక్రమానికి మాజీ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దాసరి వెంకటేష్‌లు, లక్ష్మీదేవి దంపతులను మాజీ మంత్రితోపాటు, పాఠశాల సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు శాలువ, పూలమాలతో సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. గతంలో గురువు, శిష్యుల అనుబంధం విడదీయలేదని అన్నారు. నేడు ఇరువురిలో గౌరవభావాలు సన్నగిల్లుతున్నాయని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. మధ్యాహ్న భోజనం పథకం ఏడీ వినయ్‌కుమార్, మాజీ ఎంఈఓలు కలీముల్లా, భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎంలు విజయ్‌భాస్కర్, జగదీశ్వర్, రిటైర్డ్ హెచ్‌ఎంలు రామచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ, శ్రీనివాసులు, మధు, శివారెడ్డి, సూరపరెడ్డి, రవి, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.



దాసరి వెంకటేష్ దంపతులను సన్మానిస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

నేడు టీడీపీ సమావేశం

హిందూపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు తెలుగుదేశంపార్టీ పట్టణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. పట్టణ కమిటీ, అనుబంధ కమిటీల నియామకం ఉంటుందన్నారు. కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, త్యాగరాజ్‌నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా బూతప్పస్వామి ఉత్సవం

గుడిబండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన కుంటరామజ్జగారి బూతన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం శంకరగల్లు బూతప్పస్వామి ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ

రొళ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలం మల్లినమడుగు గ్రామానికి చెందిన రంగనాథ్ కుమార్తె హాసిని రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభ చాటింది. ఎన్సీఈఆర్టీ కమ్యూన్ ఇంటర్ గ్రాంటెడ్ బీఎస్సీ ఫిజిక్స్ ప్రవేశ పరీక్షలో 21వ ర్యాంక్ సాధించింది. రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మైసూరు, హర్యాణాలో సీటు దక్కినట్లు విద్యార్థిని తండ్రి తెలిపారు.

లోపించిన పారిశుధ్యం..!

● నగర పంచాయతీలో ఎటుచూసినా చెత్తకుప్పలే..

● పట్టించుకోని అధికారులు

మడకశిర టౌన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో ఎటు చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో 20 వార్డులు ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారని ప్రజలు వాపోతున్నారు. చెత్తకుప్పలు, పందుల విహారం, ఎక్కడికక్కడ డ్రైనేజీ నిలిచిపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వర్షం కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళనను పట్టణ వాసులు వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో అధికారులు స్పందించి చెత్తకుప్పలు తొలగించక పోవడంతో సమస్యగా మారిందని అంటున్నారు. నగర పంచాయతీ కార్యాలయం పది అడుగుల దూరంలోనే చెత్తకుప్పలు పడి ఉన్నా చూసీచూడనట్లు అధికారులు వ్యవహరిస్తుండటంతో పలు విమర్శలకు దారితీస్తోంది. కార్యాలయం పక్కలోనే ఇలా ఉంటే పట్టణంలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మరోపక్క పందులు అధిక మవడం, మున్సిపల్ అధికారులకు కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుతీనగర్, చాకలికుంట, శివాపురంతోపాటు పలు వార్డులలో పందులు గుంపులు గుంపులుగా ఉదయమే ఇళ్ల మధ్యలోకి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, పందులను పట్టణానికి దూరంగా తరలించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త

భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం

గణనాథుడిని పలు గ్రామాలు, పట్టణాల్లో ఆదివారం ఐదోరోజు నిమజ్జనం చేశారు. గణపతి బొప్పా మోరియా..గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేసుకుంటూ గణనాథుడిని ఊరేగించారు. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా కేరింతలు కొడుతూ సమీప చెరువులు, కుంటల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



హిందూపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



గోరంట్లలో...



పాలసముద్రం గ్రేట్‌వే వినాయకుడి లడ్డూ వేలంలో రూ.2.60లక్షలకు దక్కించుకున్న ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ క్రిష్ణారెడ్డి



చిలమత్తూరులో...



లేపాక్షిలో...



అగళిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



పెనుకొండలో..

రహదారులు గుంతలమయం



క్యాతగానహళ్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

పావగడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని అనేక రోడ్లు గుంతలమయంగా మారాయి. రోడ్లలో ప్రయాణించేందుకు నరకయాతన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామాలకు రోడ్లు లేకపోయినా మద్యం మాత్రం దొరుకుతుందని గ్రామస్థులు అంటున్నారు. ఎక్సైజ్‌శాఖ నుంచి అనుమతులులేకపోయినా బెల్ట్‌షాపులు తెరిచి మద్యం యథేచ్ఛగా విక్రయిస్తుండటంతో యువకులు మద్యానికి బానిసై రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, బెల్ట్‌షాపులను నివారించాలని మహిళలు కోరుతున్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



రామచంద్రప్పను పరామర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి, టీడీపీ నాయకులు

అమరాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో టీడీపీ నాయకుడు రామచంద్రప్ప అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం ఆయన్ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ, రామచంద్రప్ప, గోవిందరాజులు, మహాలింగప్ప, నారాయణప్ప, శివకుమార్, శ్రీనివాస్‌యాదవ్, కరేగౌడ్, సిద్దేశ్వర, గోపీయాదవ్ పాల్గొన్నారు.